
సొహెలా నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభం

ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంట కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ధాన్యం క్వింటాలుకు రూ.3100లు మద్దతు ధర చెల్లిస్తామని వ్యవసాయశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. గురువారం బొలంగీర్ జిల్లా పట్నాగఢ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బరగఢ్ జిల్లా సొహెలా నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నామన్నారు. ఈ ఏడాది ధాన్యానికి మద్దతు ధర పెంచడంతో రైతులు ఆశలు పెంచుకుని పంట సాగు చేశారన్నారు. ధాన్యం సేకరణ కోటి మెట్రిక్ టన్నులు అవుతుందన్న అంచనా ఉందని, రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు జరుగుతుందని సింగ్‌దేవ్ చెప్పారు.

రాష్ట్రంలో 696 చిరుతలు



భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రస్తుతం 696 చిరుతలున్నాయని అటవీశాఖ అధికార వర్గాలు గురువారం ప్రకటించాయి. కేంద్రం ఆధ్వర్యంలోని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) 2022లో చిరుతల గణన చేపట్టింది. ఒడిశాలో 568 ఉన్నట్లు ప్రకటించింది. అంతకుముందు 2018లో రాష్ట్ర అటవీశాఖ గణనలో 760 చిరుతలున్నట్లు నిర్ధారణ అయింది. ఇటీవల మళ్లీ లెక్కింపు జరగ్గా ఈ సంఖ్య 696కు తగ్గిపోయింది.

నవీన్ ఏకాకిగా మిగులుతారు

భాజపా అధ్యక్షుడు మన్మోహన్ సామల్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజదకు చెందిన అగ్రనేతలెంతో మంది భాజపాలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, వారంతా పార్టీ అగ్రనేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు **మన్మోహన్ సామల్** అన్నారు. బుధవారం రాత్రి భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిజదలో అంతర్గత కుమ్ములాటలు తీవ్ర రూపం దాల్చాయన్నారు. కొద్దిరోజుల్లో ఆ పార్టీలో నేతలెవరూ ఉండరని, నవీన్ ఏకాకిగా మిగులుతారని పేర్కొన్నారు. 25 ఏళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి ఏమీ చేయలేకపోయిన ఆయన 100 రోజుల భాజపా పాలనపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. డబుల్ ఇంజిన్ పాలనలో ఇంతవరకు ప్రజలకిచ్చిన హామీల్లో భాజపా ప్రభుత్వం కొన్ని నెరవేర్చిందన్నారు. అయిదేళ్లలో పూర్తిస్థాయిలో హామీలు నిలబెట్టుకుంటామన్నారు. అధికారమే పరమావధిగా చేసుకుని, ప్రజాధనం దుర్వినియోగం చేసిన బిజద నేతలు తాము విపక్షంలో ఉన్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నారని సామల్ అన్నారు.

ఉత్కర్ష ఒడిశా సదస్సు ఫలప్రదం

- 43 దేశాల రాయబారులతో ముఖ్యమంత్రి చర్చలు
- సానుకూల ఫలితాలొచ్చాయన్న మోహన్



ఆయిల్ ఇండియా అధ్యక్షుడు రంజిత్‌తో మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: హస్తినలో భాజపా ప్రభుత్వం గురువారం చేపట్టిన ఉత్కర్ష ఒడిశా (మేక్ ఇన్ ఒడిశా) సదస్సు ఫలప్రదమైంది. 43 దేశాల రాయబారులతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి చర్చించారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ మంత్రి సంపద్ స్వయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హేమంత్‌శర్మ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు

సదస్సుకు హాజరైన వివిధ దేశాల రాయబారులతో మాట్లాడిన తరువాత ముఖ్యమంత్రి కొంతమంది ప్రముఖ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి మాట్లాడారు. ఏకగవాక్ష విధానం (సింగిల్ విండో)లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ఒకే చోట అనుమతులన్నీ కేటాయిస్తామన్నారు. స్థలం, మంచినీరు, విద్యుత్తు, రహదారులు, రైల్వే, ఓడరేవుల సౌకర్యాలు పుష్కలమని వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఢోకాలేదని, స్థిరమైన ప్రభుత్వం, కేంద్రం అండదండలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి విలేకర్లతో మాట్లాడుతూ జనవరి 28, 29 తేదీల్లో భువనేశ్వర్ వేదికగా ఉత్కర్ష ఒడిశా సదస్సు ఏర్పాటు చేస్తున్నామని, దిల్లీ సదస్సులో పాల్గొన్నవారిని ఆహ్వానించామన్నారు. రానున్న అయిదేళ్లలో రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు ధ్యేయంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. 2036 నాటికి సమృద్ధ ఒడిశా, 2047 నాటికి వికసిత్ ఒడిశా సాధించడం ధ్యేయమన్నారు. ఈ వ్యవధిలో పారిశ్రామికరంగంలో రాష్ట్రం జాతీయస్థాయిలో మొదటి స్థానంలో ఉంటుందన్నారు. విదేశీ రాయబారులు ఒడిశాలో పెట్టుబడులు పెట్టడానికి సహకరిస్తామని చెప్పారన్నారు. కేంద్రం, రాష్ట్రంలో భాజపా పాలన ఉన్నందున పారిశ్రామిక ప్రగతి సాధ్యమన్నారు. పెట్రో కెమికల్స్, సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఆహారోత్పత్తులు, పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి విదేశీ పారిశ్రామిక సంస్థలు ముందుకొచ్చాయన్నారు. దిల్లీలో చేపట్టిన తొలి సదస్సు విజయవంతమైందన్నారు. తమ వందరోజుల పాలనా కాలంలో రాష్ట్రానికి రూ.45 వేల కోట్ల పెట్టుబడులొచ్చాయని మోహన్ వివరించారు.



ముఖ్యమంత్రితో విదేశీ రాయబారి కరచాలనం

రాజకీయ వేదికగా రాజ్‌భవన్

బిజద ఎంపీల ఆరోపణ



విలేకర్ల సమావేశంలో లెనిన్ మహంతి, సులతాదేవ్, సస్మిత్‌పాత్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా రాజ్‌భవన్ ఝార్ఖండ్ ఎన్నికల రాజకీయ వేదికగా మారిందని బిజద రాజ్యసభ ఎంపీలు సస్మిత్‌పాత్ర, సులతాదేవ్ ఆరోపించారు. గురువారం సాయంత్రం బిజద కార్యాలయం శంఖభవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల రాజ్‌భవన్‌కు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, అసోం ముఖ్యమంత్రి హిమంత్‌బిశ్వశర్మ వచ్చి గవర్నరు రఘుబర్‌దాస్‌తో రహస్యంగా చర్చించారన్నారు. రాజ్‌భవన్ సూచనల మేరకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి ఝార్ఖండ్ రాష్ట్రంలో ప్రచారానికి వెళ్లారన్నారు. రఘుబర్‌దాస్ ఎన్నికల్లో పోటీ చేస్తారని, ముఖ్యమంత్రి కావాలన్న ధ్యేయంతో ఉన్నారన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో గవర్నరు దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. విలేకర్ల సమావేశంలో బిజద అధికార ప్రతినిధి లెనిన్‌మహంతి కూడా పాల్గొన్నారు.

నిరుద్యోగిత తాండవం..

యువతకు శాపం



వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న వారే ఎక్కువ

- జాతీయ సగటును మించిన రాష్ట్రం
- తాజాగా విడుదలైన పీఎల్ఎఫ్ఎస్ నివేదికలో వెల్లడి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తుండడం యువతకు శాపంగా మారుతోంది. చదువుకు తగిన ఉపాధి అవకాశాలు దొరక్క వారి బంగారు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. నిరుద్యోగ రేటు పరంగా రాష్ట్రం జాతీయ సగటును మించి ఉండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీనికితోడు రాష్ట్రంలో దాదాపు సగంమంది ప్రజలు వ్యవసాయ రంగంలో పనిచేస్తుండడం గమనార్హం. గణాంకాల, ప్రోగ్రాం అమలు మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023 జులై- 2024 జూన్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వాటి ప్రకారం .. రాష్ట్రంలో 18.9 శాతం మంది గ్రాడ్యుయేట్లు, 13.6 శాతం పోస్టుగ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉన్నారు. జాతీయ సగటు విషయానికొస్తే ఇది 13 శాతం, 12.4 శాతంగా ఉంది. ఝార్ఖండ్, పశ్చిమ్‌బంగా వంటి పొరుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మనకంటే మెరుగ్గా ఉంది. ఝార్ఖండ్‌లో నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు 7.5 శాతం కాగా, పశ్చిమ్‌బెంగాల్‌లో 8.5 శాతంగా ఉన్నారు. అదే పోస్టుగ్రాడ్యుయేట్ల విషయంలో ఇది 6.4 శాతం, 7.7 శాతంగా ఉంది. ఇదే సమయానికి (జులై 2023-జూన్ 2024) మన రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన నిరుద్యోగులు 5.1 శాతం కాగా, జాతీయ సగటు 4.9 శాతంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

కొన్ని పొరుగు రాష్ట్రాలతో మన రాష్ట్రంలో దినసరి వేతనం పోలిస్తే...

రాష్ట్రం	దినసరి వేతనం (రూ.లో)
ఒడిశా	355
పశ్చిమబెంగాల్	384
ఝార్ఖండ్	398
ఆంధ్రప్రదేశ్	583

పట్టణాల్లో అధికం

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకంటే పట్టణాల్లోనే నిరుద్యోగిత ఎక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. పట్టణాల్లో నిరుద్యోగం రేటు 8.1 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 4.7 శాతంగా ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. వ్యవసాయ రంగంలో 44.9 శాతం మంది పనిచేస్తుండగా, 2022-23లో ఇది 44.7 శాతంగా ఉన్నట్లు నివేదిక బహిర్గతం చేసింది. అధికారిక రంగం (ఫార్మల్ సెక్టార్)లో ఒక్కో వ్యక్తికి 2023 జులై-సెప్టెంబరు మధ్య సగటు జీతం రూ.18,671 దక్కగా, జాతీయ సగటు రూ.20,095గా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య మన రాష్ట్రంలో సగటు జీతం 19,567కి పెరిగినట్లు నివేదిక పేర్కొంది. దినసరి వేతనం సంపాదనలోనూ జాతీయ సగటు కంటే మన రాష్ట్రంలో రూ.78 వెనుకబడి ఉండడం గమనార్హం.



ఉపాధి మేళాలో ఉద్యోగాల కోసం బారులు తీరుతున్న యువత

కలెక్టరేట్ ముట్టడి



కలెక్టర్ కార్యాలయం వద్ద వివిధ గ్రామాల ప్రజలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: హరిశ్చంద్ర యోజన కింద 70 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.40 లక్షలను నవరంగపూర్ జిల్లా పపడహండి సమితి మానిగావ్ మాజీ సర్పంచి మంజులజానీ స్వాహా చేశారని ఆరోపిస్తూ గురువారం జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద పలు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. మానిగావ్ ప్రస్తుత సర్పంచి సుఖదేవ్‌మాఝి, జిల్లా పరిషత్ సభ్యుడు జశోబ్‌నాయక్ నేతృత్వంలో దయగుడ, గుస్రబెడ, మహేంద్రి, మమిగాం, మూసాపెల్ల, ఎకరోయ్, దహన్‌సులి తదితర 10 గ్రామాలకు చెందిన వందలాదిమంది మహిళలు, పురుషులు కార్యాలయానికి చేరుకుని అదనపు పాలనాధికారి మహేశ్వర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఆయన వారికి తెలిపారు. సుఖదేవ్‌మాఝి, జశోబ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... 2017-2022 వరకు మంజులజానీ సర్పంచిగా వ్యవహరించారు. 10 గ్రామాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన 70 కుటుంబాలకు హరిశ్చంద్ర యోజన కింద రూ.2 వేలు చొప్పున రూ.1.40 లక్షలు మంజూరయ్యాయి. వాటిని లబ్ధిదారులకు అందజేస్తానని నమ్మబలికి వారి బ్యాంకు ఖాతా పుస్తకాలను అప్పటి సర్పంచి తీసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఆ పుస్తకాలను వెనక్కి ఇవ్వకపోవడం, నగదు కూడా జమ కాకపోవడంతో పాలనాధికారిని ఆశ్రయించారు.

నేను రాజీనామా చేయడం లేదు: శాసనసభ్యురాలు సుజాత



సుజాత సాహు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తాను రాజీనామా చేయడం లేదని జాజ్‌పూర్ శాసనసభ్యురాలు సుజాతసాహు స్పష్టం చేశారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తన రాజీనామా వార్తలు నిరాధారమన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రణవ ప్రకాష్‌దాస్ (బొబి) జాజ్‌పూర్ నుంచి పోటీ చేయడానికి వీలుగా తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. జన సంపర్క యాత్ర నేపథ్యంలో బుధవారం జాజ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో బొబి ఏం చెప్పారో తనకు తెలియదన్నారు. ఆయన తనతో ఏమీ మాట్లాడలేదని, దీనిపై బిజద అధినేత నవీన్ నిర్ణయం తీసుకోలేదని వివరించారు.

అమ్మా! భవానీ!!



రామలింగ చౌడేశ్వరి అమ్మవారి అలంకరణ



జటాధరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మహిళల సామూహిక కుంకుమ పూజలు



భక్తుల పూజలు అందుకున్న గాయత్రీ మాత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో ప్రధాన నగరమైన బ్రహ్మపురలోని దేవీ మందిరాల్లో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. తెలుగు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని గాయత్రీ మందిరంలో ఉదయం తల్లికి విశేష పూజలు, శ్రీచక్ర రూపానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మార్తాపేటలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి మందిరంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి సర్వాభరణయుత పరిపూర్ణ కవచాలంకృత అవతారంతో అలంకరించారు. ఖస్పావీధిలోని శ్రీ జటాధరేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని సంతోషిమాత మందిరంలో పూజలు ప్రారంభమయ్యాయి. జటాధరేశ్వరస్వామి ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామిజీ భక్త సమితి, ఆర్యవైశ్య మహిళా విభాగం తదితర సంస్థల ఆధ్వర్యంలో వివిధ చోట్ల దేవీ నవరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి.

జయహో! దుర్గమ్మ!!



మహిషాసురమర్ధినికి పూజలు

బ్రహ్మపురలోని ఇంజినీరింగు స్కూలు కూడలి, కోర్టుపేట, కొమ్మాపల్లి తదితర ఎనిమిది చోట్లకుపైగా గురువారం దేవీ నవరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. ఆయా చోట్ల తాత్కాలిక మండపాల్లో ప్రత్యేక అర్చనలు, హోమాలు నిర్వహించారు. నగరంలోని దుర్గాపూజ తాత్కాలిక పూజాపెండాళ్లను వస్త్రాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. నగరంలో మొత్తం 42 చోట్ల పూజలు నిర్వహిస్తున్నారు.



పాతబస్టాండులో ఆకర్షణీయమైన పెండాలు

రాజరాజేశ్వరి అవతారంలో కటక్ చండి



ఆశ్వీయుజ శుక్లపక్షమి పాడ్యమి తిథిని పురస్కరించుకుని గురువారం కటక్ చండీ అమ్మవారిని రాజరాజేశ్వరి అవతారంలో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు కొనసాగుతున్నాయి.

-న్యూస్‌టుడే, భువనేశ్వర్

బాలత్రిపుర సుందరిగా అమ్మవారు

జయపురం, నవరంగపూర్, న్యూస్‌టుడే: జయపురం, నవరంగపూర్‌లలో శరన్నవరాత్రులు మొదలయ్యాయి. మొదటి రోజున బాలత్రిపుర సుందరిగా పలుచోట్ల అమ్మవారు దర్శనమిచ్చారు. జయపురం కన్యకాపరమేశ్వరి ఆలయంలో పసుపుకొమ్ములతో అమ్మవారిని అలంకరించారు. నవరంగపూర్ ప్రజల కొంగు బంగారంగా చెప్పుకొనే బండారమ్మ ఆలయాన్ని రంగుల తోరణాలు, విద్యుత్తు దీపాలు, పువ్వులతో అలంకరించారు.



ముస్తాబైన బండారమ్మ ఆలయం



జయపురంలో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు

ఏకలవ్య ఆదర్శ విద్యాలయ ఏర్పాటుకు శంకుస్థాపన



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవిత్ర శాంత, జిల్లా పాలనాధికారి కీర్తివాసన్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ నియోజకవర్గం పరిధిలో దశమంత్‌పూర్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏకలవ్య ఆదర్శ విద్యాలయ ఏర్పాటుకు బుధవారం సాయంత్రం శంకుస్థాపన జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీన్ని శంకుస్థాపన చేశారు. కేంద్ర ఆదివాసీ సంక్షేమ మంత్రి జోయల్ ఓరం పాల్గొన్నారు. కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత పాల్గొని వెనుకబడిన ప్రాంతంలో ఆదివాసీల ప్రయోజనం కోసం ఏకలవ్య ఆదర్శ విద్యాలయం ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. సమితి అభివృద్ధి అధికారి ప్రియా పుష్పాంజలి బెహరా అధ్యక్షతన జిల్లా పాలనాధికారి కీర్తి వాసన్, ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తపన్ కుమార్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సునీల్ కుమార్ తండి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ఇది రెండో ఏకలవ్య ఆదర్శ విద్యాలయ కావడం విశేషం.



పాల్గొన్న ప్రజలు. ప్రజా ప్రతినిధులు

కోలాహలంగా 'మా కాళువా అమ్మవారు' సంబరాలు



పల్లకిలో అమ్మవారిని తాత్కాలిక మందిరానికి తరలిస్తున్న భక్తులు



యాత్రలో అశ్వ నృత్యాల సందడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో గల గుసానినువాగాంలోని సుప్రసిద్ధ 'మా కాళువా అమ్మవారు' సంబరాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భక్తుల జయజయధ్వానాల మధ్య నిజ మందిరం నుంచి అమ్మవారు పల్లకిలో గుసానినువాగాం పెద్దవీధిలోని తాత్కాలిక మందిరానికి బయలుదేరింది. అడుగడుగునా తల్లికి భక్తులు మంగళహారతులు పట్టారు. గుసానినువాగాంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. ప్రారంభ యాత్రలో బొమ్మలాటలు, అశ్వనృత్యాలతోపాటు ఘంట, మృదంగ వాయిద్యాలు హోరెత్తించాయి. గురువారం మధ్యాహ్నం మా కాళువాతల్లి తాత్కాలిక మందిరానికి చేరుకుంది. అక్కడ కుమార పౌర్ణమి వరకూ రోజూ పూజలు నిర్వహిస్తారు. సంబరాల నేపథ్యంలో బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం గట్టి బందోబస్తు చేపట్టింది.

మాచ్‌ఖండ్ సందర్శించిన ఒడిశా అధికారులు



ప్రాజెక్టు సమావేశ మందిరంలో మాట్లాడుతున్న అధికారులు

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్కేంద్రాన్ని ఒడిశా జలవిద్యుత్తు కార్పొరేషన్ ఉన్నతాధికారుల బృందం గురువారం సందర్శించింది. గత నెల భారీ వర్షాలకు వరదనీరు విద్యుత్కేంద్రంలో చేరి ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఒడిశా జలవిద్యుత్తు కార్పొరేషన్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆశిష్‌కుమార్ మహంతి, గ్రిడ్కో డైరెక్టర్ ఉమకాంతసాహు, ఒడిశా లోడ్ డిస్పాచ్ సెంటర్ డైరెక్టర్ బి.బి.మెహతాలతో కూడిన బృందం ప్రాజెక్టు అధికారులతో మాట్లాడారు. ఆంధ్రా, ఒడిశా గ్రిడ్‌లకు అనుసంధానం, ఫీడర్‌లో తలెత్తుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ బృందం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ విద్యుత్కేంద్రంలో త్వరలో ఆధునికీకరణ పనులు చేపడతామని, ప్రస్తుత జనరేటర్ల పరీక్షలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. ఒడిశా అధికారులతోపాటు మాచ్‌ఖండ్ ఎస్ఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరావు, ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు, ఈఈ (సివిల్) కురేష్ ప్రధాన్, డిప్యూటీ ఈఈలు జి.సత్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చందహండిలో జనసంపర్క పాదయాత్ర

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా చందహండి సమితిలో బిజద అధ్యక్షుడు గౌరిహరి నాయక్ నేతృత్వంలో గురువారం జనసంపర్క పాదయాత్ర జరిగింది. డాబుగావ్ శాసనసభ్యుడు మనోహర్ రంధారి, జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్రమాఝి, మాజీ శాసనసభ్యులు ప్రకాష్ చంద్రమాఝి, సదాశివ్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో భాజపా ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ నినాదాలు చేశారు.



పాల్గొన్న బిజద నేతలు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి...



మాట్లాడుతున్న బీడీవో గౌర చంద్రపట్నాయక్. పక్కన శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి, ఎన్.వీరరాజు తదితరులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి కార్యాలయంలో గురువారం జరిగిన 10వ సమితి సమావేశం అధ్యక్షుడు ఎన్‌వీర్రాజు ఆధ్వర్యంలో జరిగింది. శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రహి, బీడీవో గౌరచంద్ర పట్నాయక్, సమితి ఉపాధ్యక్షురాలు ఎస్ అనసూయ, జడ్పీ సభ్యులు ఎస్.బాలరాజు, నీలావతి పరిగా తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే రూపేష్ అన్నారు. మౌలిక వసతులపై చర్చించారు.

రైతులకు నివాళి

కాశీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు అఖిలభారత కిసాన్ మజ్దూర్ సంఘ్, గజపతి జిల్లా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉత్తర్ ప్రదేశ్ లక్ష్మీపూర్ ఖేరిలోని 2020లో శాంతియుత ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో రైతులపై జరిగిన హత్యాకాండకు నిరసనగా ఎస్‌బీఐ కూడలి వద్ద ప్రతివాద సభ నిర్వహించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయి అమరులైన రైతులకు నివాళులర్పించారు. ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కేదార్ సాబొరొ, తుంబురు సాబొరొ, చైతన్య సాబొరొ, గజపతి జిల్లా రైతు కూలీ సంఘ అధ్యక్షుడు జాన్ గమాంగో, రైతులు పాల్గొన్నారు.



స్టేట్ బ్యాంకు కూడలి వద్ద నినాదాలు చేస్తున్న రైతు సంఘం నేతలు

16వ వార్డులో బీసీజీ టీకాలు



ఇందిరానగర్‌లో వృద్ధురాలికి వేస్తున్న టీకా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం 16వ వార్డులో గురువారం బీసీజీ టీకాల డ్రైవ్ నిర్వహించారు. జిల్లాలో 1.28 లక్షల మందికి ఈ టీకాలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇటీవల లక్ష్యం నిర్దేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక ఇందిరానగర్‌లో గురువారం శిబిరాన్ని ఏర్పాటు చేసి అర్హులైన వారికి ఈ టీకాలు వేశారు. క్షయవాధి నివారణకు ఈ ప్రక్రియ దోహదపడనున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. ప్రాంతాలవారీగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలు టీకాలు వేసేలా చర్యలు తీసుకున్నారు.

వర్చువల్ మాధ్యమంలో దుర్గా పూజలు ప్రారంభం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ జిల్లా సంకరయల్ పరిధిలో దుర్గా పూజలు నిర్వహిస్తున్నారు. వీటిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీంతోపాటు కళ్యాణ యూనివర్సిటీలో పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజా ప్రతినిధి డాక్టర్ జగేంద్రనాథ్ మహతో హాజరయ్యారు.

న్యాయం చేయండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖలో ఆర్‌ఐ, అమీన్ పోస్టుల భర్తీకి జరిగిన ఆన్‌లైన్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, తమకు న్యాయం చేయాలని యువతీ యువకులు డిమాండ్ చేశారు. కటక్ నేతాజీ కూడలి నుంచి పాలనాధికారి కార్యాలయం వరకు ప్రదర్శనగా వారంతా ర్యాలీ నిర్వహించారు.



కటక్‌లో ర్యాలీగా పాలనాధికారి కార్యాలయానికి వెళుతూ...

గంజాం ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పాత్రో

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం పోలీసు జిల్లా ఎస్పీగా యువ ఐపీఎస్ అధికారి **సుభేందు కుమార్ పాత్రో** గురువారం బాధ్యతలు చేపట్టారు. ఛత్రపురంలోని ఎస్పీ కార్యాలయంలో పలువురు పోలీసు అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు.



జాతీయ విలువిద్య పోటీలకు మనోజ్ ఎంపిక

జయపురం, న్యూస్‌టుడే: గుజరాత్‌లో నవంబర్ 11వ తేదీన జరగనున్న జాతీయ విలువిద్య పోటీలకు జయపురంలో బిజుపట్నాయక్ ఇంటర్ మెదటి సంవత్సరం చదువుతున్న మనోజ్ కుమార్ మద్కామి ఎంపికయ్యారు. గత నెల 30వ తేదీన భువనేశ్వర్‌లో కిస్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడు. ఈ విషయాన్ని శిక్షకుడు సుధాంశు కుమార్ పండా తెలిపారు.



శిక్షకుడితో క్రీడాకారుడు

డెంగీ వ్యాధిపై యంత్రాంగం అప్రమత్తం అవసరం



నారాయణ నాయక్‌తో చర్చిస్తున్న కాంగ్రెస్ నేతలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పట్టణంలో గత కొద్దిరోజులుగా డెంగీ వ్యాధి తీవ్ర రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని నగర్ కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేసింది. కొరాపుట్ ఎంపీ ప్రతినిధి ప్రశాంత్‌కుమార్‌కర్ నేతృత్వంలో నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీటీన్ కూల్ దీప, ఉపాధ్యక్షులు సూరజ్ బాగ్, సీమ మహంతి తదితరులు గురువారం పురపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని కార్యనిర్వాహ అధికారి నారాయణ నాయక్‌తో డెంగీ వ్యాధి పరిస్థితిపై మాట్లాడారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కొరవడడంతో వ్యాప్తి చెందిందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్పందించిన అధికారి నారాయణ నాయక్ పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి నిలుపుతామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ డెంగీ వార్డ్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సునాబెడ ప్రాంతంలో వ్యాధి ప్రబలడంపై కాంగ్రెస్ కమిటీ జిల్లా కలెక్టర్‌ను కలిసి చర్చిస్తామని ఎంపీ ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు.

అతిథి భవనం ఎన్‌ఏసీకి అప్పగించండి

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ పంథనివాస్ పరిధిలో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఎకోర్‌ట్రీట్ అతిథి భవనాలను ఎన్‌ఏసీ యంత్రాంగానికి అప్పగించాలని పట్టణ భాజపా అధ్యక్షుడు పొంచుబెహర, ఇతర ప్రతినిధులు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రోకు వినతి చేశారు. గురువారం ఉదయం మేఫెయిర్ సమావేశ మందిరంలో మంత్రిని కలిసిన వారంతా స్థానిక సమస్యలపై చర్చించారు. కేంద్రం, స్వదేశ్ దర్శన్ పథకం కింద కేటాయించిన నిధులతో నిర్మాణమైన అతిథి భవనం అయిదేళ్లుగా నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువ(యూత్) హాస్టల్ పరిస్థితి దయనీయంగా ఉందని, దీన్ని యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) గోపాల్‌పూర్ శాఖకు అప్పగించాలన్నారు. ఉప్పుటేరు, సముద్రంతో అనుసంధానించే పనులు వెంటనే ప్రారంభించాలని, అలల కోత నివారణ దిశగా మెరైన్ డ్రెడ్ విత్ సింథటిక్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. గోపాల్‌పూర్ ప్రముఖ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పనులకు ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేయాలని మంత్రికి తెలిపారు. కృష్ణచంద్ర సానుకూలంగా స్పందించారు.



మంత్రి కృష్ణచంద్రతో స్థానిక భాజపా ప్రతినిధులు

బీఈఎంసీ ఆవరణలో చిరువ్యాపారుల నిరసన



కార్యాలయం ప్రాంగణంలో నిరసన ప్రదర్శన చేస్తున్న చిరువ్యాపారులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: తమకు ఆశ్రయం కల్పించాలని డిమాండు చేస్తూ బెజ్జిపురం, గుసానినువాగాం చిరువ్యాపారులు నిరసన ప్రదర్శన చేపట్టారు. గురువారం వారంతా బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) ఆవరణలో బైఠాయించి నిరసన ప్రదర్శించారు. అంతకుముందు వారు బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయిని కలిసి వినతిపత్రం అందజేశారు. బెజ్జిపురం నుంచి గుసానినువాగాం వరకు రహదారి పక్కన తాత్కాలిక దుకాణాలు తెరుచుకునేందుకు అనుమితివ్వాలని, ఆయా ప్రాంతంలో తమ దుకాణాలు, తోపుడుబళ్లు తొలగించారని, నాలుగు రోజులుగా వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు మేయరు దొళాయికు చెప్పారు. కమిషనర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె చిరువ్యాపారులకు చెప్పారు. అనంతరం వారంతా కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లగా ఆయన కార్యాలయంలో లేకపోవడంతో బయట కొంతసేపు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు.

స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వాములు అయిన వారందరికీ కృతజ్ఞతలు, అలాగే స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతారని కొరాపుట్ నియోజకవర్గం ఎమ్మెల్యే రఘు రామ్ మచ్చో అన్నారు. సునాబెడ పుర పాలక సంస్థ ఆధ్వర్యంలో 15 రోజులు పాటు జరిగిన స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మచ్చో పాల్గొన్నారు. పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్రో, ఉపాధ్యక్షురాలు రీతు కంట, జిల్లా భాజపా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్, కార్య నిర్వాహక అధికారి నారాయణ నాయక్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు, ఉత్తమ స్వచ్ఛత కార్యకర్తలకు, ఉత్తమ స్వచ్ఛత సంస్థలకు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామ్ మచ్చో

డిమాండ్లు నెరవేర్చాలి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక డిమాండ్లను ఈ నెల 14 లోగా నెరవేర్చాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేస్తామని ఒడిశా ఆశా కార్మికుల సంఘం హెచ్చరించింది. అనంతరం ప్రధాని పేరిట రాసిన 6 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు పాలనాధికారి భాస్కర్ చంద్ర రొయితకు అందజేశారు. బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగేశ్వర దాస్ నేతృత్వంలో ఆశాకార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు తమల సాహుకార్ తదితరులు పాల్గొన్నారు.



భాస్కర్ రొయితాకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్మికులు

రమాదేవి వర్సిటీ ఇబ్బందులు విన్న గవర్నరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని రమాదేవి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్యిణి అపరాజిత చౌధురి గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నరు రఘుబర్ దాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలో ఆచార్యులు, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని, క్యాంపస్ విస్తరణ, తదితర సౌకర్యాలు అవసరమని అపరాజిత ఆయనకు వివరించారు.



గవర్నరుతో మాట్లాడుతున్న అపరాజిత

ఉత్తరప్రదేశ్‌కు ఒడిశా హ్యాండ్‌బాల్ జట్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో జరగనున్న అండర్-14, 17 జాతీయ ఐసీఎస్ఈ హ్యాండ్‌బాల్ పోటీలకు ఒడిశా జట్లు గురువారం పయనమైంది. గంజాం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్ పాఢి సాయంత్రం 'న్యూస్‌టుడే'కు ఆ వివరాలు తెలిపారు. పోటీల్లో రెండు విభాగాల జట్లు పాల్గొంటాయని, గత నెల బ్రహ్మపురలోని కళ్లికోట విశ్వవిద్యాలయం మైదానంలో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు.



పోటీలకు వెళ్లిన జట్టు క్రీడాకారులు. చిత్రంలో పాఢి

జాతీయ ఖోఖో పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులకు కాంస్యం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: సిండెగా (ఝార్ఖండ్)లోని అల్బర్ట్ ఎక్కా మైదానంలో గత నెల 28 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన 34వ సబ్‌జూనియర్ జాతీయ ఖోఖో పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు కాంస్యపతకం దక్కించుకుంది. ఈ మేరకు రాష్ట్ర క్రీడావిభాగం ఆ వివరాలు 'ఎక్స్'లో వెల్లడించింది.



గెలుచుకున్న బహుమతితో రాష్ట్ర బాలలు: చిత్రంలో కోచ్, మేనేజర్లు

గవర్నరుతో కమిషనర్ భేటీ



భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర సమాచార కమిషనర్ జైర్‌కుమార్ త్రిపాఠి గురువారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో గవర్నరు రఘుబర్ దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్దిసేపు ముచ్చటించారు.

రఘుబర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న త్రిపాఠి

విధుల్లో చేరిన ఎస్పీ పండా

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా కొత్త ఎస్పీగా జతేంద్రకుమార్ పండా రాణిపేటలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని శాంతిభద్రతలు కాపాడేందుకు కృషిచేస్తానని, ప్రజల సహకారంతో అసాంఘికశక్తులను నిర్మూలిస్తామన్నారు. తొలుత ఈయన పూరీ మందిర పోలీసు సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై గజపతి ఎస్పీగా నియమితులయ్యారు. ఆయనకు అదనపు ఎస్పీ సునీల్‌మహంతితో పాటు పలువురు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



ఎస్పీ పండాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న అదనపు ఎస్పీ సునీల్ మహంతి

నేడు కొరాపుట్ జిల్లా బంద్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో స్థానికులకు ఉద్యోగ అవకాశమివ్వాలని డిమాండ్ చేస్తూ వివిధ సంస్థలు శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6:00 వరకు బంద్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రిక్రూట్‌మెంట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రూపక్ తురుక్ పేర్కొన్నారు.

వేడుకగా శారదోత్సవం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ పట్టణ విద్యాసాగర్ స్మృతి భవన్‌లో ఛందమ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 54వ వార్షిక శారదోత్సవం కనుల పండుగ జరిగింది. అకాడమీ కళాకారుల బృంద గానాలు, నృత్యాలు, కవితా పఠనాలు ఇతర కార్యక్రమాలు ప్రదర్శించారు. సంస్థ సంచాలకుడు విశ్వేశ్వర దాస్ కళాకారుల ప్రదర్శనకు ప్రశంసించారు.

నృత్య ప్రదర్శనలో కళాకారులు



ప్రారంభమైన శరన్నవరాత్రులు

బ్రహ్మపురం నగరం, కొరాపుట్, రాయగడ, పర్లాఖెముండి, గుణుపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని శక్తి పీఠాల్లో గురువారం నుంచి శరన్నవరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. కొరాపుట్ శబరి శ్రీక్షేత్ర ప్రాంగణంలోని విమలాదేవిని వనదుర్గ అవతారంలో పూజించారు. ● గంజాం జిల్లాలోని సుప్రసిద్ధ తరాతరిణి శక్తిపీఠంలో ముగ్గురు రాష్ట్ర మంత్రులు డాక్టర్ కృష్ణచంద్ర మహాపాత్ర్ (పట్టణాభివృద్ధి శాఖ), బిభూతి భూషణ్ జెనా (రవాణా శాఖ), గోకులానంద మల్లిక్ (పశు సంవర్ధక శాఖ)లు గురువారం అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వారి వెంట ఛత్రపురం శాసనసభ్యుడు కృష్ణచంద్ర నాయక్ ఇతర భాజపా నాయకులున్నారు. ● పర్లాఖెముండి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నుంచి దేవి శరన్నవరాత్రుల పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్రతువుల్లో 100 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. విఘ్నేశ్వర పూజ, కుంకుమార్చనలు తదితర క్రతువులు పూరోహితుడు మాణిక్య మణిశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ● శరన్నవరాత్రుల్లో భాగంగా రాయగడ మజ్జి గౌరీ అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. భక్తులు దేవిని దర్శించుకుని తరించారు. ● రాయగడజిల్లా గుణుపురం పట్టణంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు మొదలయ్యాయి. గురువారం అమ్మవారిని బాలా త్రిపురా సుందరి అవతారంలో దర్శనమిచ్చారు.



వన దుర్గా అవతారంలో విమలా దేవి



స్వర్ణాభరణాలతో అమ్మవారి అలంకరణ

మౌలిక వసతులు కల్పించాలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సమస్యలు వెంటాడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో కిలోమీటర్ల దూరం వెళ్లి నీరు తెచ్చుకుంటుంటే, మరికొన్ని గ్రామాల్లో రాళ్లు దేరిన రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను వివరించేందుకు గురువారం పాలనాధికారి కార్యాలయానికి ఎస్.కరడాసింగ్, లైలై పంచాయతీలకు చెందిన కరణసాహి, రంగాడా, బిసమో, బడరైతో సాహి, తీల్లీ, బిసామాపాడి గ్రామాల ప్రజలు చేరుకున్నారు. అనంతరం పాలనాదికారి పేరిట రాసిన వినతి పత్రాలను అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్‌కి అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అదనపు పాలనాధికారి మింజ్ హామీ ఇచ్చారు.

స్వాగత కార్యక్రమం వాయిదా

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక స్వయం ప్రతిపత్తి కళాశాల విద్యార్థులు గురువారం కళాశాల ప్రధాన ద్వారానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించనున్న నూతన విద్యార్థులకు స్వాగతం (ఫ్రెషర్స్ డే)కార్యక్రమానికి అందరూ విద్యార్థులు ఏకరూప దుస్తులు ధరించి రావాలన్న నిబంధనను వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు. పోలీసులు చేరుకొని తాళాలు తెరిపించారు. ఈ కారణంగా శుక్రవారం జరగవలసిన స్వాగత కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ప్రధాన ఆచార్యులు డాక్టర్ బబి లత ప్రకటించారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కొత్త డీఐజీగా నితిన్ శేఖర్

కొరాపుట్, న్యూస్‌టుడే: దక్షిణ పశ్చిమాంచల నూతన డీఐజీగా **నితిన్ శేఖర్** గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవిభక్త కొరాపుట్ జిల్లా శాంతిభద్రతల పరిరక్షణ, స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు పని చేస్తానని తెలిపారు.



శిబరామ్ పాణిగ్రహికి 'సంబాద్ పర్యావరణవేత్త అవార్డు'

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు దశాబ్దానికిపైగా ఉద్యమిస్తున్న బ్రహ్మపుర సబుజ వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు శిబరామ్ పాణిగ్రహికు 'సంబాద్ పర్యావరణవేత్త' అవార్డు లభించింది. సంబాద్, కనక న్యూస్ వార్షికోత్సవం సందర్భంగా భువనేశ్వరలోని స్వస్తి ప్రీమియమ్‌లో 'ఎర్త్ ఎగైన్ మూమెంట్' పేరిట మూడు రోజుల మహా సమ్మేళనం బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ పాల్గొని ఆయనకు ఈ అవార్డు అందజేశారు.



కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ నుంచి అవార్డు అందుకున్న శిబరామ్ పాణిగ్రహి

రహదారి ప్రమాదంలో యువకుడు దుర్మరణం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం-కుంద్రా రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఐఐసీ ఈశ్వర్ తాండి తెలిపిన వివరాల ప్రకారం సంబర్‌తోట ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ గురువారం ద్విచక్రవాహనంపై కుంద్రా నుంచి జయపురానికి వెళ్లాడు. గగనాపూర్ పేపరు మిల్లు వద్ద వాహనం అదుపుతప్పి శ్రీకాంత్ కింద పడ్డాడు. తలకి బలమైన గాయమైంది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పరీక్ష అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మరొకరు...

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గణపతి జిల్లా మోహన ఠాణా పరిధిలోని హలపంక గ్రామం వద్ద రహదారి ప్రమాదంలో ముగ్గురు గాయాపడ్డారు. ఠాణా అధికారి బసంత్ శెఠి తెలిపిన వివరాల ప్రకారం గోవిందపూర్ పంచాయతీ హలపంక గ్రామం మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కేశర గ్రామానికి చెందిన కృష్ణఖర్జీ(40)గా పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు అదే గ్రామానికి చెందిన అశోక్ గౌడ్, దను బిసోయ్‌లను మెరుగైన చికిత్సకోసం బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నారు.

వ్యానును ఢీకొన్న బైకు: ముగ్గురికి గాయాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వ్యాను, ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత వివేకానంద స్కూల్ సమీపంలో ఓ వ్యాను మలుపు తిరుగుతుండగా కపిలాస్ రహదారిలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం వ్యానుని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న కృష్ణ, టున్నాముదిలి, గణేష్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ ఈశ్వర్ తాడి తెలిపిన వివరాల ప్రకారం గురువారం పాత్రపుట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అతివేగంతో వస్తున్న కారును ఆపి తనిఖీలు చేశారు. కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ నుంచి నవరంగపూర్‌లో రాయ్‌ఘర్ సమితికి అక్రమంగా తరలిస్తున్న 53 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించగా బెయిల్ మంజూరు కాకపోవడంతో జైలుకు పంపారు. వీరు నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి బడకుమారి పంచాయతీ యువి-2 గ్రామానికి చెందిన ప్రత్యూష్ మండల్, రాయ్‌ఘర్ సమితి గంజపగా పంచాయతీ కుసుమపూర్ గ్రామానికి చెందిన అరిందయ్‌రాయ్‌గా పోలీసులు గుర్తించారు.

రూ. మూడున్నర లక్షలు దోపిడీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని చంద్రశేఖర్‌పూర్ స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ నుంచి గురువారం మధ్యాహ్నం రూ.మూడున్నర లక్షల సొమ్ము తీసుకొని సంచిలో ఉంచి ఇంటికి వస్తున్న అన్నాచెల్లెల్ని ఇద్దరు దుండగులు గాయపరిచి సొమ్మున్న బ్యాగు లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితులు చంద్రశేఖర్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు నుంచి తమను ద్విచక్రవాహనంలో వెంబడించిన దోపిడీదారులు శిరస్త్రాణాలు ధరించి ఉన్నారని తెలిపారు. తాము చంద్రశేఖర్‌పూర్‌లో ఇల్లు నిర్మిస్తున్నామని, పనులు చేస్తున్న వారికి చెల్లించడానికి నగదు తీసుకొని నడుచుకుంటూ వస్తుండగా ఘటన జరిగినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ఠాణా పోలీసులు దుండగుల కోసం గాలింపు ప్రారంభించారు.

యువకుడిపై మారణాయుధాలతో దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బెగునియాపడా ఠాణా పరిధిలోని నచిపూర్ కూడలి వద్ద బుధవారం రాత్రి భగవాన్ పరిడా అనే యువకుడిపై కొందరు మారణాయుధాలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ పరిడాను చికిత్సకు కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చేర్పించిన పోలీసులు ఆయన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించారు. కళ్లికోట ఠాణా పరిధిలోని భకుటాడిహ గ్రామానికి చెందిన పరిడా పనిమీద బయటకు వెళ్లి సొంతూరు తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో నచిపూర్ కూడలి వద్ద పాతకక్షల నేపథ్యంలో కొందరు సామూహికంగా ఆయనపై దాడి చేశారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు, 13 మేకలు మృతి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ సమితిలో పిడుగుపాటుకు గురై రెండు ఆవులు, 13 మేకలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే చంద్రపడ పంచాయతీ పిపిలగూడ గ్రామానికి చెందిన సదవ్ గుంజువాకు చెందిన రెండు ఆవులు, ఒక మేక, సోనియా నాయక్-4, కపిలాస్ నాయక్-2, ఉద్దవ్ నాయక్-1, కృష్ణజానీ-2, బతిపొర్జా-3 మేకలను గురువారం మేతకు పొలాల్లో విడిచిపెట్టారు. ఈ సమయంలో వర్షం కురవడంతో పశువులతో పాటు మేకలు ఓ చెట్టు కిందకు వెళ్లాయి. ఇంతలో పిడుగుపడడంతో మూగజీవాలు గాయపడ్డాయి. స్థానికులు సమాచారం మేరకు వాటిని పశువులు ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధితుల్ని యంత్రాంగం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సక్షం.. మదిలో అక్షరం



మొక్కలతో ఆహ్లాదకరంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ

అంగన్‌వాడీకి వెళ్లాలంటే కొందరు పిల్లలు మారం చేస్తారు.. బుజ్జగిస్తే తప్ప ఇళ్ల నుంచి కదిలే పరిస్థితి ఉండదు.. గర్భిణులు, బాలింతలు సైతం కేంద్రాల వద్ద ఉండేందుకు ఇష్టపడరు.. కానీ ఆ గ్రామంలో మాత్రం అంగన్‌వాడీ కేంద్రమే ఓ ఉద్యానం.. అదే ఓ సినిమా థియేటర్.. సరికొత్త అనుభూతిని పంచే భవనం.. సక్షం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తూ అందరి మన్ననలూ పొందుతోంది పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పిండ్రంగివలస కేంద్రం.

ఆదర్శం ఇలా.. 'సక్షం' కేంద్ర ప్రభుత్వ పథకం. ఇటీవల కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మహిళ, శిశు వికాస్ మంత్రి అన్నపూర్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే గతేడాది దేశంలో కొన్ని గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. మొదలు పెట్టారు. అందులో పిండ్రంగివలస ఒకటి. టీవీతో పాటు వివిధ రకాల పరికరాలను అందించారు. ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించేవారు. ఈ సదుపాయాలను కేంద్రం కార్యకర్త బంగారమ్మ సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఈమె 2021లో రాష్ట్రస్థాయిలో చాంపియన్ ఆఫ్ ఐసీడీఎస్‌గా, ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా ప్రశంస దక్కించుకున్నారు.

అంతా ఇక్కడే.. పాచిపెంట మండలంలో ఇదో గిరిజన ప్రాంతం. ప్రారంభంలో చిన్నారులు వెళ్లేవారు కాదు. గర్భిణులు, బాలింతలు సైతం దూరంగా ఉండేవారు. కొన్నేళ్లుగా అక్కడే సేదదీరుతున్నారు. మొక్కలతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో ఉంటూ.. 15 మంది చిన్నారులతో సరదాగా గడుపుతుంటారు. టీవీలో బొమ్మలతో కూడిన పాఠాలు చెబుతున్నామని.. వారు ఇష్టపడే బొమ్మలు, ఆట వస్తువులను సొంతంగా తయారు చేసి బోధిస్తున్నామని బంగారమ్మ చెబుతున్నారు. స్థానికంగా పండే కూరగాయలతో పాటు పూలు, పండ్లను వారికే అందజేస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట



పండ్ల రకాల బొమ్మలు



ఎల్ఈడీ టీవీలో దృశ్యాలను తిలకిస్తున్న చిన్నారులు

కోటదుర్గమ్మ ఉత్సవాలకు ఆహ్వానం



రామ్మోహన్‌నాయుడుకు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న సభ్యులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ ఉత్సవాలకు హాజరు కావాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కమిటీ సభ్యులు ఎస్.సంతోష్, రుద్ర కోటేశ్వరరావు ఆహ్వానించారు. శ్రీకాకుళంలో వారిని కలిసి అమ్మవారి చిత్రపటం, ఆహ్వాన పత్రికలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణ

సీతానగరం: సీతానగరం వేణుగోపాల ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీనృసింహున్ని అర్చకులు శ్రీనివాసాచార్యులు గురువారం పూలమాలలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముడుపుల పూజలు చేశారు.

అపురూపం.. అమ్మవారి నిజరూపం!



ప్రారంభ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కమిటీ సభ్యులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తల్లి రవణమ్మతో కలిసి తొలి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ పూజలు నిర్వహించారు.

బారులు తీరిన భక్తులు..

తొలి రోజు అమ్మవారి నిజరూప దర్శనానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సుమారు 30 వేల మంది వరకు రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏడాది ప్రముఖులను మాత్రమే అంతరాలయంలోకి ఆహ్వానించడంతో సామాన్య భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ప్రియాంక నిషాని దంపతులు, ఎమ్మెల్సీ పి.విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణాధ్యక్షుడు జి.సంతోష్, యోగిత తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.




పోటెత్తిన భక్తులు

455 కిలోల గంజాయి పట్టివేత

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 455 కిలోల గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జి.మాడుగుల సీఐ సీహెచ్.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి తరలింపుపై ముందుగా అందిన సమాచారం మేరకు పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేట కూడలిలో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఒడిశా నుంచి వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలు, వాటి వెనుక వస్తున్న బొలెరో పికప్ వ్యాన్‌ను ఆపి పరిశీలించారు. వ్యాన్‌లోని 18 బస్తాల్లో 455 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీనిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రంలోని నందాపూర్ బ్లాక్ గొల్లోరి గ్రామానికి చెందిన పాంగి ప్రశాంత్ (21), కూర్లసింగి గ్రామానికి చెందిన చెట్టి సుశాంత్ (21), అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధికి చెందిన చెట్టి ఆశిష్‌కుమార్(26)తోపాటు మరో బాలుడిని పట్టుకున్నారు. పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో మరో ముగ్గురు వారి కళ్లుగప్పి పరారయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 22.75 లక్షల వరకు ఉంటుంది. నిందితుల నుంచి బొలెరో వ్యాన్‌తోపాటు మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు చరవాణులు, రూ.5,300 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు, బాలుడిని జువైనల్ హోంకు తరలించామని సీఐ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

గత పాలకుల నిర్లక్ష్యాలు.. ప్రజల కన్నీటి కష్టాలు

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం: పలాస మండలంలో స్వచ్ఛమైన తాగునీరు పూర్తిస్థాయిలో అందని గ్రామాలు ఇంకా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు వర్షాలు, మరోవైపు విషజ్వరాలతో సతమతమవుతున్న ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందని ద్రాక్షలా మారుతోంది. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన ట్యాంకులు కొన్ని శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపోయే స్థితిలో ఉన్నాయి.



బంటుకొత్తూరులో రెయిలింగ్ దుస్థితి

రంగులేసి వదిలేశారు..

గత ప్రభుత్వ హయాంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా కొన్ని చోట్ల పనులు జరగలేదు. మరి కొన్ని చోట్ల ముప్పై ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకులకే రంగులు వేసి కొత్తగా కనిపించేలా మార్పులు చేశారు. పాత ట్యాంకులు ఉన్న చోట్ల మెట్లు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే లేరు. కొన్ని ట్యాంకుల వద్ద పరిశుభ్రత కొండెక్కింది. దాని కారణంగా ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి ప్రతి ట్యాంకును 15 రోజులకోసారి శుభ్రం చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అలా జరగడం లేదు.

ట్యాంకులు శుభ్రం చేయరు..

పలాస మండలం బ్రాహ్మణతర్లాలో సుమారు 4700 మంది నివసిస్తున్నారు. రెండు నీటి ట్యాంకులు ఉన్నాయి. ఇందిరా కాలనీ వద్దట్యాంకు మెట్ల రెయిలింగ్ పాడైపోయి ఉండటంతో శుభ్రం చేయడానికి వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మామిడిపల్లి గ్రామంలో మెట్లు కూలిపోవడంతో ట్యాంకు పైకి వెళ్లి దాన్ని శుభ్రం చేసే సాహసం చేయడం లేదు. దాదాపు రెండేళ్లుగా అక్కడ నుంచి వచ్చిన నీటిని ప్రజలు తాగడంతో గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి.



బ్రాహ్మణతర్లాలో మెట్ల పరిస్థితి

చర్యలు తీసుకుంటాం

శిథిలావస్థకు చేరిన ట్యాంకులను తొలగించి కొత్తవి నిర్మిస్తాం. మెట్ల రెయిలింగ్ పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడతాం.

-బి.ధనుంజయ ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పలాస గ్రామీణం

కళాశాల మైదానాభివృద్ధి ఎప్పుడు?



ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తవ్వేయడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు ఆటలాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన ఓ వ్యాపారవేత్త కొండ కంకరతో పూడ్చేందుకు గత ఏడాది ప్రయత్నించారు. కొండను తవ్వేస్తున్నారన్న ఫిర్యాదుతో ఆ పనులు ఆగిపోయాయని ప్రిన్సిపల్ డా.రాబిన్ కుమార్ పాఢి తెలిపారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే దాతల ద్వారా గుంతలను పూడ్చుకోవచ్చని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లగా కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టరూ..

వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం ఎస్సీ వీధి నుంచి పెదవంక బీటీ రోడ్డు వరకు ఉన్న మార్గం అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో రాళ్లు తేలి దర్శనమిస్తోంది. సీసీ రోడ్డు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు గ్రామ సభలో తీర్మానం చేశామని సర్పంచి బత్తిని సృజన తెలిపారు.– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



పరిశ్రమ పెట్టరు.. స్థలం ఇవ్వరు

★ రద్దు చేద్దామంటే సాంకేతిక సమస్య

పరిశ్రమ కోసం స్థలాన్ని తీసుకొని ఏడాది లోపు యూనిట్ ఏర్పాటు చేయకుంటే సంబంధిత యజమానికి ముందుగా నోటీసు ఇచ్చి రద్దు చేసేవారు. ఆ స్థలాన్ని కొత్తగా వచ్చే ఔత్సాహికులకు కేటాయించేవారు. కానీ.. తాజా నిబంధనలు గుదిబండగా మారాయి. రద్దు చేయాలంటే యజమాని ఆమోదం తప్పనిసరి చేయడంతో ఏపీఐఐసీకి ఇబ్బందికరంగా మారింది. కనీసం నోటీసులు ఇస్తే తీసుకోని వారు రద్దు చేస్తామంటే ఎలా ముందుకు వస్తారన్నది ప్రశ్నగా మారింది. మరోవైపు యూనిట్ల యజమానుల బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఈ ప్రభావం పారిశ్రామికవాడ అభివృద్ధిపై పడుతోంది.

– న్యూస్‌టుడే, బొబ్బిలి

బొబ్బిలి పారిశ్రామికవాడలో ఐదేళ్ల కిందట స్థలాలు తీసుకుని పరిశ్రమలు పెట్టని 20 మంది యజమానులను ఆరు నెలల కిందట ఏపీఐఐసీ గుర్తించింది. వారికి నోటీసులు కూడా ఇచ్చారు. వివరణ రాకపోవడంతో రద్దు చేసి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్తే సాంకేతిక సమస్య రావడంతో అధికారులు మిన్నకుండిపోయారు. స్థల యజమాని సంతకాలు ఉండాలి అనడంతో వారికి సమాచారం ఇచ్చినా రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. వాటిని రద్దు చేస్తే సుమారు 30 ఎకరాలు అందుబాటులోకి వస్తుంది. ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై పునరాలోచన చేస్తే తప్ప రద్దుకు అవకాశం లేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్‌విండో విధానంలో అనుమతులు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి.

★ ఆస్తి పన్ను బకాయిలు **రూ.8.50 కోట్లు**
★ నీటి రుసుము **రూ.3 కోట్లు**
★ ఇతర పన్నులు **రూ.1.50 కోట్లు**

రూ.కోట్లలో బకాయిలు

పరిశ్రమలు ఏర్పాటు చేయడమే కాదు యజమానులు ఖాళీ స్థలాల పన్ను కూడా చెల్లించడం లేదు. మూతపడ్డ యూనిట్ల నుంచి కూడా ఆస్తి పన్ను వసూలు కావడం లేదు. పరిశ్రమలకు ఇచ్చిన నీటి సరఫరా రుసుములు రావడంలేదు. సుమారు రూ.13 కోట్ల పైచిలుకు బకాయిలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నారు. నోటీసులు ఇస్తున్నా స్పందన లేదన్నారు. దీనివల్ల అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని అంటున్నారు.

నిధుల జాడలేదు

పారిశ్రామికవాడ అభివృద్ధికి గత ఐదేళ్లలో నిధులు రాలేదు. రహదారులు పాడయ్యాయి. విద్యుద్దీకరణ పరికరాలు మూలకు చేరాయి. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపినా పైసా విదల్చలేదు. ఇదిగో అదిగో అంటూ గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఇటీవల వర్షాలకు రహదారులపై భారీ గుంతలు పడి వాహనాలు కూరుకుపోతున్నాయి.



రద్దు చేసేందుకు గుర్తించిన స్థలాల్లో ఇదొకటి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

స్థలాల రద్దుకు ఇబ్బందులు రావడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. స్పష్టత వచ్చాక రద్దు చేస్తాం. యూనిట్ల ఏర్పాటుకు ఎవరు ముందుకు వచ్చినా నిబంధనల మేరకు వెంటనే కేటాయిస్తాం. బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాం.

– మురళీమోహన్, జోనల్ ప్రబంధకుడు, ఏపీఐఐసీ

పొట్లం విప్పి చూడ.. కల్తీ ఉండును



రంగులు మారిన మాంసం

న్యూస్‌టుడే, నేరవార్తా విభాగం

● గజపతినగరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మార్కెట్లో బెల్లం కొనుగోలుకు వెళ్లారు. ఈలోపు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు ఆ దుకాణంపై దాడులు చేసి, వివిధ పదార్థాల నమూనాలను సేకరించారు. ల్యాబ్‌కు పంపించగా.. బెల్లంలో సల్ఫర్, ఇతరత్రా రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు.

● నగరానికి చెందిన ఓ ఉద్యోగి ప్రముఖ కంపెనీకి చెందిన నూనె కొన్నారు. రంగు మారడంతో అనుమానం వచ్చి ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి పరిశీలించగా.. నాసిరకం అని తేలింది. దీంతో విక్రయదారులపై కేసులు నమోదు చేశారు.

● నగర శివారు ప్రాంతంలోని రెస్టారెంటులో ఓ కుటుంబం భోజనం చేయడానికి వెళ్లింది. చికెన్- 65 రుచి మారింది. రంగు ఎక్కువగా ఉంది. వారి ఫిర్యాదుతో అధికారులు రంగంలోకి దిగగా.. ఆకర్షించేందుకు రసాయనాలు వాడినట్లు గుట్టు రట్టు చేశారు.

బెల్లం మెరిసిపోతోందా.. టీపొడి మంచి వాసనొస్తోందా.. కందిపప్పు భళేగా ఉందా.. నెయ్యి నిగనిగలాడుతోందా.. చికెన్- 65 ఎర్రగా కనిపిస్తూ నోరూరిస్తోందా.. అయితే ఒక్క క్షణం ఆగండి.. రంగు.. వాసన చూసి కొనేయకండి.. అవి కల్తీవి కూడా కావొచ్చని చెబుతున్నారు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు. ఇటీవల నిర్వహిస్తున్న దాడుల్లో పెద్దఎత్తున రసాయనాలతో కూడిన పదార్థాలను పట్టుకుంటున్నారు. ఈమేరకు విస్తుగొల్పే విషయాలను వెల్లడించారు.



నల్లగా మారిన నూనెను చూపిస్తున్న అధికారి

47 కేసులు..

జిల్లాలో ఆహార కల్తీ పెద్దఎత్తున సాగుతోంది. చిన్నపాటి దుకాణాల నుంచి పెద్దస్థాయి హోటళ్ల వరకు రసాయనాలతో కూడి పదార్థాలు దర్శనమిస్తున్నాయి. రోజూ ఎక్కడో ఓ చోట ఇలాంటి ఘటనలు బయటపడుతున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు 47 కేసులు నమోదు చేశారు. అంటే ఆహార కల్తీ ఏమేర సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. తరచూ దాడులు లేకపోవడం, వినియోగదారులు గుర్తించలేకపోవడం, విక్రయదారులు విచ్చలవిడితనం.. తదితర కారణాలతో ఈ దుస్థితి నెలకొంది.

ఫిర్యాదు చేయండి..

మా బాధ్యతగా ప్రతి నెలా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వ్యాపారులంతా నియమ, నిబంధనలు పాటించాలి. వినియోగదారులు అప్రమత్తంగా ఉంటేనే కల్తీపై కేసులు నమోదు చేయగలం. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.

– ఈశ్వరి, ఆహార కల్తీ నియంత్రణ శాఖాధికారిణి

పొడి నుంచి పండ్ల వరకు..

నిత్యావసరాలుగా వినియోగించే వాటినే ఎక్కువగా కల్తీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ విశ్రాంతి ఉద్యోగి మార్కెట్లో అరకిలో టీ-పొడి కొని, టీ పెట్టమని కుటుంబ సభ్యులను కోరారు. వారు వేడినీళ్లలో పొడి వేయగానే రంగుమారిపోయింది. వెంటనే దుకాణానికి వెళ్లగా.. తనకు సంబంధం లేదని యజమాని చెప్పారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు.. తనిఖీ చేయగా.. రసాయనాలు వాడినట్లు స్పష్టం చేశారు.

● బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొన్న యాపిల్ పండ్లు నెలరోజులైనా పాడవలేదు. అధికారులు పరిశీలించగా.. రసాయనాల పూత ఉన్నట్లు తేల్చారు.

ఏనుగుల రాకతో ఆందోళన

పార్వతీపురం గ్రామీణం, కొమరాడ, న్యూస్‌టుడే: ఇన్నాళ్లు కురుపాం నియోజకవర్గంలో సంచరించిన ఏనుగులు గురువారం పార్వతీపురం చేరుకున్నాయి. కొమరాడ మండలం నుంచి కృష్ణపల్లి పంచాయతీ బండిదొరవలస మీదుగా చినమరికి, రావికూడలో తిరిగాయి. చివరికి రంగలగూడ టేకు తోటల్లో తిష్ఠ వేశాయి. గతంలో ఇక్కడ నష్టాలు మిగిల్చిన ఏనుగులు మళ్లీ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక రేంజర్ మణికంఠ నేతృత్వంలో అటవీ సిబ్బంది, ట్రాకర్లు పర్యవేక్షిస్తున్నారు. ఏనుగులు గ్రామాలకు దూరంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని డీఎఫ్‌వో ప్రసూన తెలిపారు.



రంగలగూడ తోటలో ఏనుగు

వర్షం పడితే నడకా నరకమే..!



వజ్రపుకొత్తూరు మండలం ఎన్‌పీరోడ్డు నుంచి ఉద్దానం కూర్మనాథపురం మీదుగా కొండవూరు వరకు ఉన్న గ్రావెల్ రోడ్డులో చిన్నపాటి వర్షానికే రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల కిందట ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గ్రావెల్ రోడ్డు వేసినా.. తిత్లీ తుపాన్‌కు రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. ఇటీవల కురిసిన వర్షానికి ఇలా బురదమయంగా మారడంతో విద్యార్థులు నానా కష్టాలు పడుతూ ప్రయాణం సాగించారు. ఈవిషయమై పీఆర్ జేఈ నాగభూషణ్ మాట్లాడుతూ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ముళ్లపొదలతో ప్రమాదం..

ఇచ్ఛాపురం పట్టణం నుంచి రత్తకన్నకు చేరుకునే కొళిగాం రోడ్డు దుస్థితి ఇది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ముళ్ల చెట్టు కొమ్మలు రహదారి పైన విస్తరించడంతో వాహన చోదకులు గాయపడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు తప్పించే క్రమంలో గాయపడుతున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ర.భ.శాఖ ఏఈ పి.మోహనరావు మాట్లాడుతూ.. ముళ్ల పొదలు తొలగిస్తాం. నిధులు విడుదలయ్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



రహదారిపైనే చెత్త..



పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం టి.కె.ఆర్.కల్యాణ మండపం పక్కవీధిలో కాలువ నుంచి తీసిన పూడికలు రహదారిపై వదిలేయడంతో రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకొమ్మలు తొలగించి వాటని అక్కడే వదిలేశారని, అధికారులు స్పందించి రోడ్డుపై చెత్త, చెట్టుకొమ్మలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. సిబ్బందిని పంపించి రహదారులపై ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని పారిశుద్ధ్య కార్యదర్శి ఉదయ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పలాస